నమస్తే తెలంగాణ

# ఖమ్మం

5 | ఖమ్మం, మంగళవారం 1 ఏప్రిల్ 2025 | KHAMMAM

# సీఎం, ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం

## నిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేస్తే ఊరుకోం: వామపక్ష విద్యార్థి సంఘాలు

భద్రాచలం/ కొత్తగూడెం గణేష్‌టెంపుల్, మార్చి 31: హైదరాబాద్ హెచ్‌సీయూలో విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు భద్రాచలం పట్టణంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థి సంఘం నాయకులు రవీందర్, రాంచరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు శివప్రశాంత్, భూపేందర్ మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తూ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు వేలం వేయాలని నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. దీనిని వ్యతిరేకిస్తూ పది రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నా వారిని అడ్డుకుంటూ అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. నిర్బంధాలు, బెదిరింపులకు పాల్పడితే చూస్తే ఊరుకునేది లేదని, భూముల వేలం సర్క్యులర్‌ను వెనక్కు తీసుకోకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కొత్తగూడెంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీలో అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, తనుజ్, బాలకృష్ణ, వేణు, దిలీప్, వంశీ, రవి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు



కొత్తగూడెంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



ఆతిథ్యం ఇచ్చిన మైనార్టీ నేతలకు విషెస్ చెబుతున్న అజయ్



వద్దిరాజుతో ముస్లిం సోదరులు, బీఆర్ఎస్ నాయకులు



మైనార్టీ సోదరుడికి రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న రేగా

# ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

- భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- కిటకిటలాడిన ఈద్గాలు, మసీదులు
- రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు



ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలతో ఈద్గాలు, మసీదులు కిటకిటలాడాయి. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మతపెద్దలు మాట్లాడుతూ అల్లా కరుణ అందరిపై ఉంటుందని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. ఆయా చోట్ల ప్రార్థనల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు పాల్గొని మాట్లాడుతూ మత సామరస్యం, సర్వమానవ సమానత్వం, కరుణ, దాతృత్వానికి ఈద్-ఉల్-ఫితర్ ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ పవిత్ర రంజాన్ మాసం సమాజంలో ప్రేమ, శాంతి, ఐక్యతను చాటిచెబుతుందన్నారు. ఖమ్మం నగరంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కూసుమంచిలో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, మణుగూరులో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, కొత్తగూడెంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్, సత్తుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మధిరలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తదితరులు పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. – నమస్తే నెట్‌వర్క్



పాల్వంచలో నమాజు ఆచరిస్తున్న ముస్లిం సోదరులు



ఖమ్మం నగరంలోని గొల్లగూడెం ఈద్గాలో ప్రత్యేక నమాజు ఆచరిస్తున్న ముస్లిం సోదరులు



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతున్న వనమా



ఇల్లెందులో మైనార్టీ సోదరులతో హరిప్రియానాయక్



ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న కందాళ



ముస్లింలకు విషెస్ చెబుతున్న సండ్ర

**అనుకున్నదే అవుతోంది. 'మాట తప్పడంలో కాంగ్రెస్ సర్కారుకు పెట్టింది పేరు' అనే యథార్థం ప్రతి ఒక్కరికీ బోధపడుతోంది. 'ద్రోహం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దానికదే బ్రాండ్' అంటూ సాధారణ ప్రజలు కూడా సంభాషించుకుంటున్నారంటే ప్రజల్లో అది ఎంతలా నాటుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. 'కాంగ్రెస్ అంటేనే మాట తప్పే సర్కారు' అంటూ అన్ని వర్గాల ప్రజల్లో ఇప్పటికే బలమైన ముద్ర ఉందంటే అతిశయోక్తి కాదు. అధికారం 'చే'జిక్కించుకునేందుకు నోటికొచ్చిన హామీలను ఇచ్చినప్పటి నుంచి వాటిని అమలు చేసే విషయంలో మాట తప్పుతున్న అంశాల వరకూ అన్నింట్లోనూ అదే తీరంటే ఆశ్చర్యమే లేదు. ముఖ్యంగా రెండు నెలల క్రితం సాక్షాత్తూ ముఖ్యమంత్రే ఇచ్చిన మాటను కూడా తాజాగా తప్పడంతో పేద ప్రజల్లో ఏహ్యభావం ఏర్పడుతోంది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అనే నాలుగు పథకాలను రెండు నెలల క్రితం అంటే సాక్షాత్తూ గణతంత్ర దినోత్సవమైన జనవరి 26న రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా, అట్టహాసంగా ప్రారంభించింది. హామీల అమలు విషయంలో ఆనాటి సభలోనే ముఖ్యమంత్రి అనేకసార్లు మాటలు మార్చారు. చివరికి 'మార్చి 31' అంటూ గడువు పెట్టారు. కానీ, నిన్నటితో ఆ గడువు కూడా ముగిసిపోయింది. కానీ ఆ నాలుగు పథకాలను అమలు చేసిందీ లేదు. మాటను నిలబెట్టుకున్నదీ లేదు. ముఖ్యంగా యాసంగి పంటల కోతల సమయం దగ్గర పడుతున్నప్పటికీ రైతులకు కనీసం రైతుభరోసా ఇచ్చిన పుణ్యమూ లేదు. దీంతో అందరినోటా ఒకేమాట. అదే.. 'మళ్లీ దగా.. అదే ధోకా..'. –భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 31 (నమస్తే తెలంగాణ)**

# మళ్లీ దగా.. అదే ధోకా..

- 'మాట తప్పే సర్కారు'గా అన్ని వర్గాల ప్రజల్లో బలమైన ముద్ర
- ఇప్పటికే మితిమీరిన గడువులు, లెక్కకు మిక్కిలి వాయిదాలు..
- మార్చి 31లోపు రైతులందరికీ 'భరోసా' ఇస్తామని జనవరి 26న హామీ
- నిన్నటితో ముగిసిన గడువు.. 5 ఎకరాలు పైబడితే అందని సాయం
- భద్రాద్రి జిల్లాలో ఇంకా 43 వేల మంది అన్నదాతల ఎదురుచూపులు
- జమ చేసింది రూ.163 కోట్లు.. ఇంకా చేయాల్సింది రూ.170 కోట్లు..
- మాట తప్పుతూ మోసం చేస్తున్న సర్కారుపై సర్వత్రా ఆగ్రహావేశాలు



'ఆరు గ్యారెంటీల్లో భాగంగా నాలుగు పథకాలను ఇప్పుడు అమలుచేస్తున్నాం. పైలట్ గ్రామాల్లో ఈ పథకాలను తక్షణమే అమల్లోకి తెస్తున్నాం. మిగతా గ్రామాల్లో మార్చి 31లోగా అమలుచేస్తాం. విస్తీర్ణంతో సంబంధం లేకుండా అర్హత ఉండి ఎన్ని ఎకరాలు సాగుచేస్తున్న రైతుకైనా మార్చి 31లోపు రైతుభరోసాను జమ చేస్తాం' అంటూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది జనవరి 26న జరిగిన నాలుగు పథకాల ప్రారంభ సభ సాక్షిగా సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే, పైలట్ గ్రామాల్లోనే ఆ పథకాలు అమలుకు నోచుకోలేదు. ఇక మిగతా గ్రామాల ప్రజలదీ అదే పరిస్థితి నెలకొంది. అయితే, ఇచ్చిన గడువు మేరకు మార్చి 31లోగా తమకు రైతుభరోసా జమ అవుతుందేమోనని ఆశించిన రైతులకు చివరికి ఆశాభంగమే ఎదురైంది. ముఖ్యమంత్రి పెట్టిన గడువు ముగిసినప్పటికీ భద్రాద్రి జిల్లాలో ఐదు ఎకరాలకు పైబడి సాగు భూమి ఉన్న రైతులకు రైతుభరోసా జమ కాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది వానకాలం సాగుకు అందాల్సిన రైతుభరోసా రానేలేదు. మార్చి 31 అంటూ గడువు పెట్టిన యాసంగి సీజన్ రైతుభరోసాకూ అతీగతీ లేదు. దీంతో యాసంగి వరిసాగు కోతల దశకు చేరుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో రైతుభరోసా జమచేయకపోవడం, ఇప్పటి వరకూ ఐదెకరాల్లోపున్న రైతులకు రోజుకు కొద్దిమంది చొప్పున ప్రహసనంలా జమ చేస్తుండడం, ఇంకా జమ కావాల్సిన రైతులకే సింహభాగం నిధులు కావాల్సి ఉండడం, మార్చి 31 గడువు దాటినా వాటికి జమచేస్తారో లేదోనన్న సందేహాలు వెల్లువెత్తుతుండడం వంటి కారణాల నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఫోన్‌లు చూసుకుంటున్నా, బ్యాంకు ఖాతాల్లో బ్యాలెన్స్ చెక్‌చేసుకుంటున్నా రైతుభరోసా మాత్రం కాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.




నీరు లేక ఎండిపోతున్న వరి పంట



### ఐదెకరాలకు పైబడిన రైతులకు జమకాని 'భరోసా'

జిల్లాలో 1,80,718 మంది రైతులున్నారు. వారిలో ఇప్పటివరకు ఐదెకరాల్లోపు సాగుభూమిని కలిగి ఉన్న 1,37,718 మంది రైతులకు రైతు భరోసా పంటల పెట్టుబడి సాయం అందింది. ఇంకా ఐదెకరాలకు పైబడి సాగుభూమి కలిగి ఉన్న 43 వేల మంది రైతులకు జమ కావాల్సి ఉంది. జిల్లాలో యాసంగిపంట సాగుచేసిన రైతులకు రూ.333 కోట్లు రైతు భరోసా రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.163.20 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ 43 వేల మంది రైతులకు ఇంకా సుమారు రూ.170 కోట్లు జమ కావాల్సి ఉంది. అంటే ఇప్పటి వరకూ ఐదెకరాల్లోపు ఉన్న 1,37,718 రైతులకు అందించిన సాయం కంటే.. ఐదెకరాలకు పైబడి ఉన్న 43 వేల మంది రైతులకు అందాల్సిన రైతుభరోసా నిధులే అధికం. అయితే గడువు ముగిసినందున అవి అందుతాయో లేదోనని అన్నదాతలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


### కాలం కూడా అయిపోతోంది..



యాసంగి సీజన్ కూడా అయిపోతోంది. మరో రెండు నెలలైతే వానకాలం సీజన్ కూడా మొదలవుతుంది. కానీ ఇప్పటి వరకు రైతు భరోసా రాలేదు. రోజూ ఫోన్‌లో మెసేజ్‌లు చూసుకుంటున్నాను. కానీ రైతుభరోసా జమ అయిన మెసేజ్ మాత్రం రావడం లేదు. బ్యాంకుకు వెళ్లి వాకబు చేసినా జమకాలేదనే చెబుతున్నారు. అసలే పంటలు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఇప్పుడు పంటల సాయం కూడా ఇవ్వకుండా మాలాంటి రైతులను మోసం చేస్తే ఎలా?

**–మద్దిరాల చిన పిచ్చయ్య, రావికంపాడు, చంద్రుగొండ**

### నిన్న కూడా చూశాను.. జమ కాలేదు..



సీజన్‌లో పంట వేసినప్పుడు పెట్టుబడి సాయం ఎంతో అవసరముంటుంది. అప్పుడు జమ చేస్తే వ్యవసాయ పనులకు అక్కరకొస్తాయి. అవి అందకపోవడం వల్లనే వడ్డీ వ్యాపారుల దగ్గరకు వెళ్లాల్సి వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీజన్‌కు ముందే ఇవ్వడం లేదు. సీజన్ ముగిశాక ఇస్తే ఏం ఉపయోగం? సీజన్‌కు ముందే రాకపోవడంతో అప్పు తెచ్చుకొని మరీ ఎరువులు, పురుగుమందులు తెచ్చుకున్నాం. కనీసం పంటకు నీళ్లు పెట్టుకునే సమయానికీ ఇవ్వలేదు. నేను నిన్ననే బ్యాంకుకు వెళ్లి చూసుకున్నా. భరోసా ఇంకా జమ కాలేదు.

**–కుంజా కృష్ణ, రామన్నగూడెం, ములకలపల్లి**


### రైతుభరోసాపై ముఖ్యమంత్రి మాట తప్పారు..



మార్చి 31 నాటికి రైతులందరి ఖాతాల్లో రైతుభరోసా జమచేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. గడువు దాటినా జమ చేయకుండా మాట తప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇలా అనేకసార్లు గడువులు పెట్టి మాట తప్పిన విషయాన్ని ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారు. మార్చి 31న నాటికి రైతులందరికీ రైతు భరోసా నిధులు అందజేస్తామని ఇటీవల అసెంబ్లీ సాక్షిగా కూడా మరోసారి చెప్పారు. కానీ ఇవ్వకుండా రైతులను మరోసారి మోసం చేశారు.

**–లకావత్ గిరిబాబు, బీఆర్ఎస్ నాయకుడు**

### అందరికీ సాయం అందుతుంది..



ఐదు ఎకరాల్లోపు సాగు భూమి ఉన్న రైతులకు నిన్నటి వరకు రైతుభరోసా జమ అయింది. ఐదు ఎకరాలకు పైబడి పంటభూములు ఉన్న రైతులకు కూడా తప్పక అందుతుంది. అర్హత ఉన్న రైతులు ఎన్ని ఎకరాలు సాగుచేస్తున్నప్పటికీ వారందరికీ రైతుభరోసా కింద పంటల పెట్టుబడి సాయం అందుతుంది. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఆలస్యం అవుతున్నప్పటికీ రైతుభరోసా జమ అవుతుంది.

**–బాబూరావు, డీఏవో, భద్రాద్రి**

# ఆకట్టుకునేలా ట్రైబల్ మ్యూజియం

## ఏర్పాట్లను పరిశీలించిన ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, మార్చి 31: నిత్యం భద్రాచలం వచ్చే పర్యాటకులు, భక్తులకు ఆకట్టుకునే విధంగా ఐటీడీఏలోని ట్రైబల్ మ్యూజియం ఉండాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. ట్రైబల్ మ్యూజియం ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరామనవమి, స్వామివారి పట్టాభిషేకం కార్యక్రమాలకు ప్రముఖులు, పర్యాటకులు తరలివచ్చే అవకాశం ఉన్నదని, వారంతా మ్యూజియంను సందర్శించే అవకాశం ఉన్నందున సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన కళా ఖండాలు, చిత్రాలను తీర్చిదిద్దే పనులు చివరి దశలో ఉన్నందున పీవో పరిశీలించి పలు సూచనలు చేశారు. మ్యూజియం లోపల పర్యాటకులకు తాగునీటి సౌకర్యంతోపాటు ఆర్వో ప్లాంట్, రిసెప్షన్ కౌంటర్, బీచ్ వాలీ బాల్ కోర్టు తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ఏపీవో పవర్ వేణు, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, టీవీ శ్రీనివాస్, ఏఈ రవి, జీపీఈవో శ్రీనివాస్, మ్యూజియం ఇంచార్జి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



ట్రైబల్ మ్యూజియం పనులను పరిశీలిస్తున్న పీవో రాహుల్

# నల్లబ్యాడ్జీలతో ముస్లింల నిరసన

## 'వక్ఫ్ బోర్డు మార్పిడి బిల్లు'కు వ్యతిరేకంగా నినాదాలు



అశ్వారావుపేట: నల్లబ్యాడ్జీలు ధరించి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఖమ్మం, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు మార్పిడి బిల్లును తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ముస్లిం మైనార్టీలు ఆరోపించారు. రంజాన్ పండుగ రోజు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పలు మండలాల్లో బైక్ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ముస్లిం ఆస్తులను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం వాటిపై కన్నేసి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. సబ్-కా సాత్, సబ్-కా వికాస్ అనేది కేవలం నినాదంగా మారిందని, ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ విధానాలను రాజకీయ పార్టీలు ప్రతిఘటించాలని పలువురు ముస్లిం నేతలు పిలుపునిచ్చారు. కొత్తగూడెం, కూసుమంచి, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, బూర్గంపహాడ్, వేంసూరు మండలాల్లో ముస్లింలు ప్రార్థనల అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.



కూసుమంచిలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మైనార్టీలు

# ర్యాండమ్ రీ వాల్యుయేషన్

- నయాబజార్ ఇంటర్ స్పాట్‌ని తనిఖీచేసిన అబ్జర్వర్ యాదగిరి
- వ్యత్యాసం ఉంటే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టీకరణ

ఖమ్మం అర్బన్, మార్చి 31: పరీక్షల నిర్వహణ, సమాధాన పత్రాల వాల్యుయేషన్, ఫలితాల విడుదల.. ఇవన్నీ పకడ్బందీగా జరగాల్సిన ప్రక్రియలు.. ఎక్కడ నిర్లక్ష్యం జరిగినా ఫలితం తారుమారు అవుతుంది. అందుకే పరీక్షల ఫలితాల విడుదలకు ముందే సమాధాన పత్రాల వాల్యుయేషన్‌లో ఏమైనా లోపాలుంటే గుర్తించేందుకు ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తున్నది. వాల్యుయేషన్‌ను ర్యాండమ్ రీ వెరిఫికేషన్ చేయిస్తున్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రక్రియను అబ్జర్వర్ యాదగిరి తనిఖీ చేశారు.



సమస్యలు పరిష్కరించాలని అబ్జర్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ లెక్చరర్లు

### నాలుగు స్లాబ్‌లుగా...

జిల్లాకు చేరిన సమాధాన పత్రాలను వాల్యుయేషన్ చేసిన అనంతరం పార్ట్-3ని ఉన్నతాధికారులకు పంపిస్తారు. దానిలో మార్కులను నిక్షిప్తం చేశారు. ఇలా మూల్యాంకనం చేసిన సమాధాన పత్రాల్లో రీ వాల్యుయేషన్ చేసేందుకు నాలుగు స్లాబ్‌లుగా విభజించారు. మొదటిది 35శాతంలోపు మార్కులు వచ్చినవి, రెండోది 35 నుంచి 50లోపు, మూడోది 50 నుంచి 80లోపు, నాలుగోది 80శాతంపైన మార్కులు సాధించినవి. సోమవారం ఖమ్మం జిల్లాలోని ఫస్ట్ ఇయర్ సంస్కృతం 51 సమాధాన పత్రాలను నాలుగు స్లాబ్‌ల నుంచి ఎంపిక చేసి సబ్జెక్ట్ నిపుణుల చేత పునః మూల్యాంకనం చేయించారు. రెండింటిలో మినహా మిగిలిన వాటిల్లో మార్కుల వ్యత్యాసం రాలేదు.. రెండింటిలో మాత్రం ఒకటి, రెండు మార్కులు వ్యత్యాసం వచ్చినట్లు బోర్డు అబ్జర్వర్ గుర్తించారు. రీ వాల్యుయేషన్ చేసిన వివరాలను బోర్డుకు నివేదించనున్నారు. రీ వాల్యుయేషన్ చేసినప్పుడు వ్యత్యాసం 5 మార్కుల కంటే ఎక్కువ ఉంటే చర్యలు ఉంటాయని అబ్జర్వర్ యాదగిరి తెలిపారు.

### 7వ తేదీలోగా పూర్తి..

ఇంటర్ మూల్యాంకనం ప్రక్రియను ఈ నెల 7వ తేదీలోగా పూర్తి చేయాలని బోర్డు అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటివరకు తెలుగు, హిందీ, చరిత్ర సమాధాన పత్రాల మూల్యాంకనం పూర్తయింది. మార్చి 22న పూర్తిస్థాయిలో వాల్యుయేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా జిల్లాకు 3,05,591 సమాధాన పత్రాలు వచ్చాయి. వాటిల్లో సోమవారం నాటికి 1,50,340 పూర్తయ్యాయి. మిగిలిన పత్రాల్లో పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్‌ను ఈ నెల 2వ తేదీ వరకు, బోటనీ, జువాలజీ సబ్జెక్ట్స్ 5వ తేదీ వరకు, ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, కామర్స్ సబ్జెక్టులు 6వ తేదీ వరకు, కెమిస్ట్రీ, సంస్కృతం 7వ తేదీలోగా పూర్తి చేయనున్నారు. సమాధాన పత్రాల మూల్యాంకనం కోసం 146 మంది సీఈలు, 743 మంది ఏఈలు, 146 మంది స్క్రూటినీలు, ఎస్ఈలు-24 మంది విధుల్లో పాల్గొంటున్నారు.

### జూనియర్ లెక్చరర్ల వినతి..

స్పాట్ విధుల్లో పాల్గొన్న వారికి వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని అబ్జర్వర్ యాదగిరికి జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. విధులు కేటాయించేటప్పుడు సీనియార్టీని పాటించకుండా ఇబ్బందులు పెట్టారని, భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చూడాలని కోరారు.